సాక్షి ఖమ్మం

సోమవారం, 25, సెప్టెంబర్, 2023



చెల్లింపులు ఇక ఆన్‌లైన్

ఈ-నామ్ విధానంలో భాగంగా ఖమ్మం మార్కెట్‌లో పంట విక్రయించిన రైతులకు ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించనున్నారు. 10లో



... ఆ గొంతే ఆయుధం

గద్దర్ బతికున్నంత కాలం తన ఆట, పాటలతో పేదల హక్కుల కోసం పోరాడారని పలువురు వక్తలు నివాళులర్పించారు. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఒకటి, రెండు చోట్ల చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

స్వచ్ఛతా హీ సేవలో డీఆర్‌డీఓ విద్యాచందన



వీధులు శుభ్రం చేస్తున్న విద్యాచందన తదితరులు

తిరుమలాయపాలెం: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఈ విషయంలో గ్రామ పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. ఆదివారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. అధికారులు, సిబ్బందితో కలిసి వీధులను శుభ్రం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకునేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని చెప్పారు. వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చుంచు శ్రీనివాసరావు, ఎంపీఓ రాజేశ్వరి, ఈజీఎస్ ఏపీఓ నర్సింహారావు, గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వార్డు సభ్యుడు శ్రీను, పంచాయతీ కార్యదర్శులు బాలాజీ, సాలె ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



క్రీడాకారులతో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం స్పోర్ట్స్ : ఇటీవల హైదరాబాద్ డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదివారం అభినందించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన జ్వాలిత్ ప్రథమస్థానం, మోహి, శ్రియాన్, శివాని, హరి, ఉజ్వల్, యశ్వంత్ ఆ తర్వాత స్థానాల్లో నిలిచారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించటం పట్ల డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, అధ్యక్షుడు డాక్టర్ జంగాల సునీల్‌కుమార్, కోశాధికారి డాక్టర్ శశికుమార్, కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి అభినందించారు.


నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మున్నేరు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదివారం పరిశీలించారు. నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, వాహనాలు సులభంగా వచ్చిపోయేలా ఏర్పాట్లు చేయాలని, లైటింగ్ అమర్చాలని సూచించారు. గజ ఈతగాళ్లను, మున్సిపల్ సిబ్బందిని సరిపడినంత మందిని అక్కడ ఉంచాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఈఈ కృష్ణలాల్, డీఈ శ్రీనివాస్, ఏఈ శ్యామ్‌మనోహర్ తదితరులు ఉన్నారు.

గల్లీల్లో గ్యాంగ్‌వార్



గంజాయి, మద్యం మత్తులో యువత

- జిల్లా కేంద్రంలో రాత్రయితే ఇదే పరిస్థితి
- వేడుకల పేరిట రహదారులపై చక్కర్లు
- పోలీసు పెట్రోలింగ్ తగ్గడంతో ప్రజలకు ఇక్కట్లు

ఖమ్మంక్రైం: కొంతకాలంగా జిల్లా కేంద్రంలో గ్యాంగ్‌వార్ సంస్కృతి పెచ్చరిల్లుతోంది. జులాయిగా తిరుగుతున్న యువత బ్యాచ్‌లుగా విడిపోయి గొడవలకు దిగుతున్నారు. ఇందులో పలువురు గంజాయి, మద్యం మత్తులో పరస్పర దాడులు చేసుకుంటున్నారు. దీంతో కొన్నిసార్లు హత్యల వరకు వెళ్తుండగా.. ఇంకొన్ని సార్లు క్షతగాత్రులవుతున్నారు. అయితే, రాత్రివేళ ఈ గొడవలు ఎక్కువగా జరుగుతుండగా.. పోలీస్ నిఘా కరువవడంతో అడ్డుకునే వారే లేకుండా పోయారు. ఫలితంగా జిల్లా కేంద్ర శివార్లలోని కొన్ని కాలనీల ప్రజలు నిద్ర మాని ఆందోళనతో గడపాల్సి వస్తోంది.

పార్టీల పేరిట చక్కర్లు

నగరంలో పలువురు యువకులు బర్త్‌డే ఫంక్షన్‌ల పేరుతో ద్విచక్రవాహనాలు, కార్లపై తిరుగుతూ నడిరోడ్డు మీద కేక్‌లు కట్‌చేస్తూ ఊరంతా చక్కర్లు కొడుతున్నారు. ముఖ్యంగా నగర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలను ఎంచుకుని మాదక ద్రవ్యాలతోపాటు మద్యం తాగుతూ నానా గొడవలు చేస్తున్నారు. ఎవరైనా అడిగితే మత్తులో దాడులకు సైతం పాల్పడుతున్నారు.

బ్యాచ్‌లుగా విడిపోయి దాడులు

ద్విచక్ర వాహనాలపై కొంతమంది అకతాయిలు తిరుగుతూ ఒకరిపై ఒకరు పరస్పర దాడులు చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఈ దాడులు ఎక్కువయ్యాయి. కొన్ని నెలల క్రితం గంజాయి మత్తులో ఇద్దరు యువకులు మరో యువకుడిపై కత్తితో పొడిచి హత్యచేసిన ఘటన ఖమ్మంలో చోటు చేసుకుంది. వారం రోజుల క్రితం త్రీటౌన్ ప్రాంతంలో రంగనాయకుల గుట్టపై జరిగిన పరస్పర దాడుల ఘటనలో వినయ్ అనే యువకుడి తలకు తీవ్రంగా గాయమైంది. అతడికి 20కి పైగా కుట్లు పడగా ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ముస్తాఫనగర్, మమత ఆసుపత్రి రోడ్, రమణగుట్ట బైపాస్ ప్రాంతంలో సైతం ఇదే తరహాలో యువకులు పరస్పర దాడులు చేసుకుంటున్నారు.

రహదారులపైనే వేడుకలు

బర్త్‌డే పేరుతో కొంతమంది అకతాయిలు రోడ్లపైనే కేకులు కోసి గట్టిగా అరుస్తూ బాణాసంచా కాల్చుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తెల్లవార్లూ రోడ్లపై తిరుగుతూ కేకలు వేస్తూ ఇబ్బందులు పడేలా చేస్తున్నారు.

అరాచక శక్తులపై ఉక్కుపాదం



ఖమ్మంలో అరాచక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం. రోడ్లపై అర్ధరాత్రుల్లో తిరిగే ఆకతాయిలు, అల్లరి మూకలపై కఠిన చర్యలు ఉంటాయి. ఖమ్మంలో సీపీ విష్ణు ఎస్.వారియర్ ఆదేశాల మేరకు పోలీస్ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశాం. ఏదైనా గొడవలు జరుగుతుంటే వెంటనే డయల్ 100కు ప్రజలు సమాచారం అందించాలి.

– హరికృష్ణ, ఖమ్మం ఏసీపీ

పట్టించుకోని పోలీసులు

ఖమ్మంలో గ్యాంగ్ వార్ నడుస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డుమీద గ్యాంగ్‌లుగా మారి కొట్టుకుంటున్న సమాచారం పోలీసులకు అందించినా ఆలస్యంగా ఘటనా స్థలానికి చేరుకుంటున్నారు. ఒక్కోసారి అసలు అటు వైపు రావడమే లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళ పోలీస్ పెట్రోలింగ్ కొరవడిందని, గస్తీ తిరగడం లేదని అంటున్నారు. అయితే దీనిపై పలువురు పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ.. అకతాయిలపై తమకు చర్యలు తీసుకునే అవకాశం ఉండటం లేదని, స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించే లోపే వారిని విడిచిపెట్టాలంటూ రాజకీయ నాయకుల నుంచి పైరవీలు వస్తున్నాయని వాపోతున్నారు. దీంతో తాము కూడా చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నామని చెబుతున్నారు. అయితే పోలీసులు ఎలాగైనా స్పందించి ఖమ్మంలో గ్యాంగ్‌లుగా తిరుగుతున్న అకతాయిలపై చర్యలు తీసుకుని శాంతిభద్రతలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

27న వినాయక నిమజ్జనం

- ఖమ్మంలో ఉదయం 10:30 నుంచి శోభాయాత్ర
- 3:30 గంటలకు గాంధీచౌక్‌లో వీడ్కోలు సభ



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు వినోద్ లాహోటి

ఖమ్మంగాంధీచౌక్: వైభవంగా నవరాత్రులు జరుపుకుంటున్న గణేశుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఈనెల 27న(బుధవారం) నిర్వహించనున్నారు. వినాయక చతుర్థి ఉత్సవాలు ఈనెల 18న ప్రారంభం కాగా, నవరాత్రి ఉత్సవాల అనంతరం నిమజ్జనంపై భక్త మండళ్లకు పలు సందేహాలు తలెత్తగా.. వేదపండితులు, వైదిక, పురోహిత సంఘం నిర్ణయం మేరకు 27న నిమజ్జనం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు వినోద్ లాహోటి ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలో సమావేశం నిర్వహించి నిమజ్జన తేదీ, కార్యక్రమ వివరాలను వెల్లడించారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు మండపాల వద్ద శోభాయాత్ర ప్రారంభించాలని సూచించారు. నగరంతో పాటు, పరిసర ప్రాంతాల్లో శోభాయాత్రల అనంతరం మధ్యాహ్నం 3:30 గంటలకు గాంధీచౌక్ వద్ద సార్వత్రిక గణేష్ నిమజ్జన వీడ్కోలు బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సభకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథి రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కలెక్టర్ వీపీ గౌతమ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, సీపీ విష్ణు ఎస్ వారియర్ హాజరవుతారని వివరించారు. సభ అనంతరం కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్‌లోని మున్నేరులో నిబంధనల మేరకు గణేశ్ నిమజ్జనం చేయాలని సూచించారు. కాగా, మాలధారులు మండపాల వద్ద పురోహితులు, మాతృమూర్తి ద్వారా మాల విరమణ చేయవచ్చని వైదిక కమిటీ స్పష్టం చేసింది. సమావేశంలో స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి కీసర జయపాల్ రెడ్డి, కార్యాధ్యక్షుడు గెంట్యాల విద్యాసాగర్, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి అల్లిక అంజయ్య, కోశాధికారి మూలగుండ్ల శ్రీహరి, డొలే సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కళాక్షేత్రం అభివృద్ధికి కృషి

జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

ఖమ్మంగాంధీచౌక్: ఎందరో కళాకారులకు గుర్తింపు తీసుకొచ్చిన భక్త రామదాసు కళాక్షేత్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ అన్నారు. ఆదివారం రాత్రి నెలనెలా వెన్నెల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఖమ్మం కళాపరిషత్, అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్క్స్), ప్రజానాట్య మండలి కృషితో నెలనెలా వెన్నెల కార్యక్రమం జరగడం హర్షణీయమని అన్నారు. భక్త రామదాసు కళాక్షేత్రంలో ఇంకా అభివృద్ధి కార్యక్రమాలు మిగిలి ఉన్నాయని, వాటిని నెలరోజుల్లో పూర్తి చేసేలా కృషి చేస్తానని చెప్పారు. సామాజిక స్పృహతో ఆలోచించదగిన నాటికలను కళాకారులు ప్రదర్శించడం శుభ పరిణామమని అన్నారు. ఆర్క్స్ సంస్థ అధ్యక్షుడు మోటమర్రి జగన్మోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ సిటీ అధినేత గరికపాటి వెంకట్రావు అందించిన పారితోషికాన్ని కమల్‌రాజ్ చేతుల మీదుగా నాటిక దర్శకుడికి అందజేశారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు సోమా నర్సింహారావు, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ నాగబత్తిని రవి, జాబిశెట్టి పాపారావు, అన్నాబత్తుల ప్రదీప్‌కుమార్, ఆర్క్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఏఎస్ కుమార్, ప్రజానాట్య మండలి అధ్యక్ష, కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, సదానందం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, మైత్రి కళానిలయం విజయవాడ కళాకారులు ప్రదర్శించిన 'ఇతిహాసం' నాటిక ప్రేక్షకులను అలరించింది.

30న సత్తుపల్లికి మంత్రి కేటీఆర్ రాక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

- ఎన్నికల యుద్ధానికి సిద్ధం కండి
- ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: సత్తుపల్లికి ఈ నెల 30న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ వస్తున్నారని, పట్టణంలో రూ.90 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం 200 మందికి రూ.1.3 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సత్తుపల్లిలో మినీస్టేడియం, షాదీఖానా, అంబేడ్కర్ భవనం, క్రిస్టియన్ కమ్యూనిటీ భవనం, చాకలి ఐలమ్మ భవనం, వేంసూరురోడ్‌లో సెంట్రల్ డివైడర్ పనులకు కేటీఆర్ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మండలంలోని రామానగరం లో నేడు గృహలక్ష్మి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మంజూరు పత్రాలు అందిస్తామన్నారు. ఎన్నికల సమయం ఆసన్నమైందని.. యుద్ధానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్యారంటీ పథకాలతో ప్రజలను వంచించేందుకు ప్రయత్నిస్తున్నారని.. కత్తులు దూసుకున్నోళ్లు ఒకే పార్టీలో చేరి వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాయల శేషగిరిరావు, కూసంపూడి మహేశ్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, దొడ్డా హైమావతి, లక్కినేని అలేఖ్య, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, చల్లగుండ్ల కృష్ణయ్య, పాలెపు రామారావు, ఒగ్గు విజయలక్ష్మి, దొడ్డా శంకర్‌రావు, యాగంటి శ్రీనివాసరావు, మోరంపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణపుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకా లం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

'కానుక'లొస్తున్నాయ్..!

- జిల్లాకు చేరుతున్న 'బతుకమ్మ' చీరలు
- ఇప్పటికే గోదాంలకు తరలించిన 2,49,500 చీరలు
- నెలాఖరులోగా మొత్తం రానున్న కోకలు



వైరా గోదాంలో నిల్వ చేసిన చీరలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: బతుకమ్మ చీరలు జిల్లాకు చేరుకుంటున్నాయి. బతుకమ్మ – దసరా పండుగను పురస్కరించుకుని ఏటా ప్రభుత్వం ఆడపడుచులకు చీరలు పంపిణీ చేస్తోంది. బతుకమ్మ వేడుకలు మొదలు కాకముందే పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుంది. జిల్లాలో 18 ఏళ్లు నిండిన మహిళలు 5,00,562 మంది ఉండగా.. ఈ ఏడాది జిల్లాకు 5,01,287 చీరలు అవసరమని జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే, గతేడాది జిల్లాలో 4,27,700 చీరలు మాత్రమే పంపిణీ చేయడంతో ఈ ఏడాది కూడా జిల్లాకు అంతే సంఖ్యలో ప్రభుత్వం కేటాయించింది. జిల్లాకు చేరుతున్న ఈ కానుకలను అధికారులు గోదాముల్లో నిల్వ చేయిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాకు 2,49,500 చీరలు వచ్చాయి. మొత్తం చీరలు రాగానే వచ్చే నెల మొదటి వారంలో జిల్లా అంతటా పంపిణీ జరగనుంది.

చీరతో పాటు బ్లౌజ్..

చీరలను ప్లాస్టిక్ బండిళ్లలో ప్యాక్ చేసి ఉంచారు. ఒక్కో బండిల్‌లో 160 చీరలు ఉంటాయి. చీరల పొడవులో రెండు రకాలుగా ఉండనున్నాయి. 6.60 మీటర్ల పొడవు గల చీరలు కొన్ని, 9 మీటర్ల పొడవు గల చీరలు కొన్నింటిని జిల్లాకు కేటాయించారు. రఘునాథపాలెం టీఎస్‌డబ్ల్యూ గోదాంకు 6.60 మీటర్ల పొడవు గల చీరలు 1,37,000 కేటాయించగా.. ఇప్పటి వరకు 75 వేలు చేరుకున్నాయి. 9 మీటర్ల పొడవు గల చీరలు 30 వేలు కేటాయించగా.. 15 వేల చీరలు వచ్చాయి. మధిర మార్కెట్ గోదాంకు 6.60మీటర్ల పొడవు గల చీరలు 70వేలు కేటాయించగా 25వేలు చేరుకున్నాయి. 9మీటర్ల పొడవు గల చీరలు 15వేలకు 7,500 చీరలు చేరాయి. నేలకొండపల్లి గోదాంకు 6.60 మీటర్ల పొడవు గల చీరలు 70వేలు కేటాయించగా 65 వేల చీరలు చేరాయి. 9మీటర్ల పొడవు గల చీరలు 15 వేలు కేటాయించగా 7,500 చీరలు చేరాయి. వైరా మార్కెట్ గోదాంకు 6.60 మీటర్ల పొడవు గల చీరలు 75వేలు కేటాయించగా.. 47వేలు, 9 మీటర్ల పొడవు గల చీరలు 15వేలకు 7,500 చీరలు చేరాయి. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది చీరలో రన్నింగ్ బ్లౌజ్ కూడా ఉంటుంది. పలు రంగులు, అనేక డిజైన్లతో కూడిన బతుకమ్మ చీరలను జిల్లాకు సరఫరా చేస్తున్నారు.

గోదాములకు చేరిన చీరలు

ఈ చీరలను భద్రపరిచేందుకు అధికారులు జిల్లాలో నాలుగు గోదాములను ఏర్పాటు చేశారు. వైరా, నేలకొండపల్లి, మధిర మార్కెట్ కమిటీ, రఘునాథపాలెం టీఎస్‌డబ్ల్యూ గోదాముల్లో చీరలను నిల్వ చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాకు 2,49,500 చీరలు రాగా.. వీటిని ఆయా గోదాముల్లో భద్రపరిచారు. చీరల నిల్వలు, పంపిణీని డీఆర్‌డీఓ, డీఆర్‌డీఏ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. గ్రామ స్థాయిలో చీరల పంపిణీ బాధ్యతను పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘం, రేషన్ షాపు డీలర్‌లు చేపట్టనున్నట్లు తెలిసింది. ఇక అర్బన్ ప్రాంతాల్లో వార్డుకు సంబంధించిన బిల్ కలెక్టర్, వార్డులోని మహిళా సంఘం సభ్యులు, రేషన్‌షాపు డీలర్‌లు పంపిణీ చేయనున్నారు. పంపిణీకి సంబంధించి నాలుగు రోజుల ముందుగా రేషన్ షాపుల వారీగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఆధారంగా లబ్ధిదారులను గుర్తిస్తారు. 18 ఏళ్లు దాటి, అంత్యోదయ అన్న యోజన కార్డు కలిగిన మహిళలు కూడా ఈ పథకానికి అర్హులే.

గోదాములలో నిల్వ చేస్తున్నాం



బతుకమ్మ పండుగకు ప్రభుత్వం మహిళలకు అందించే కానుకలు జిల్లాకు చేరుకుంటున్నాయి. జిల్లాలో గుర్తించిన గోదాముల్లో వీటిని భద్రపరుస్తున్నాం. మొత్తం చీరలు వచ్చాక పంపిణీ చేస్తాం. ప్రభుత్వ నిబంధనలు, కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో చీరల పంపిణీకి చర్యలు తీసుకుంటాం.

– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

మాస్టర్ ప్లాన్‌పై మౌనమేల..?

- భద్రాచల క్షేత్రంలో ఆధ్యాత్మిక పర్యాటకంపై శీతకన్ను
- అవకాశాలు మెండుగా ఉన్నా పట్టించుకోని ప్రభుత్వాలు
- అభివృద్ధి చేస్తే మరింత ఆదరణ, ఉపాధి, ఆదాయం
- భద్రాద్రి కేంద్రంగా తీర్థయాత్ర టూరిజంపై ఆశలు



భద్రగిరి ఆధ్యాత్మిక క్షేత్రం

భద్రాచలం: ఆధ్యాత్మిక క్షేత్రమైన భద్రాచలం కేంద్రంగా పర్యాటక అభివృద్ధికి అవకాశం ఉన్నా అడుగు ముందుకు పడటంలేదు. ఫలితంగా రామాయణ ఇతివృత్తంతో ముడిపడి ఉన్న క్షేత్రాలు, ప్రకృతి అందాలను సందర్శకులు, భక్తులు చూడలేకపోతున్నారు. ఆధ్యాత్మిక టూరిజం 'మాస్టర్ ప్లాన్' రూపొందించి అమలు చేస్తే ఇంకా ఆదరణ పెరిగే అవకాశం ఉంటుంది.

రామాలయానికే పరిమితం

భద్రాచలం అంటే కేవలం రామాలయం మాత్రమే స్ఫురణకు వచ్చే పరిస్థితి నెలకొంది. దక్షిణ అయోధ్యగా ప్రత్యేక స్థానం ఉన్నా పర్యాటక అభివృద్ధిలో వెనుకబడింది. ఉత్సవాలు, సెలవు రోజుల్లో భద్రాచలం, పర్ణశాల క్షేత్రాలకు భక్తులు అధికంగా తరలివస్తుంటారు. కానీ మిగతా రోజుల్లో సందడే కనిపించదు. భద్రాచలం, చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేస్తూ, అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడంలేదు.

ఇవీ అవకాశాలు

దేవస్థానం నుంచి కరకట్ట వరకు సరాసరి ఫ్లైఓవర్‌తో అనుసంధానం చేస్తూ ప్రస్తుతం ట్రెండ్‌గా మారిన కేబుల్ బ్రిడ్జిని ఏర్పాటు చేయవచ్చు. భక్తరామదాసు స్మరణతో రంగనాయకుల గుట్టపై నిర్మించిన జ్ఞానమందిరం వరకు కూడా ఫ్లైఓవర్‌ను నిర్మించవచ్చు. రామాలయానికి అనుబంధంగా శివాలయం, శ్రీ లక్ష్మీనర్సింహస్వామి, అభయాంజనేయ తదితర ఆలయాలు ఉన్నాయి. రామాలయంలో మూలమూర్తుల దర్శనం అనంతరం ఈ ఉపాలయాలను దర్శించుకునేలా అనుసంధాన బ్రిడ్జిలు నిర్మించే అవకాశం ఉంది. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజనుల ఆచార సంప్రదాయాలకు నిలయమైన ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయవచ్చు. దీంతో భద్రాచలానికి మరింత ఆదరణ, ఆదాయం పెరిగే అవకాశం ఉంది. స్థానికులకు ఉపాధి కూడా లభిస్తుంది.

ప్రతిపాదనల్లోనే థీమ్ పార్కు

భద్రాచలాన్ని రామాయణ ఇతివృత్తాలను తెలిపేలా రామాయణ థీమ్ పార్క్ ఏర్పాటుకు గతంలో సన్నాహాలు జరిగినా.. రాష్ట్ర విభజన అనంతరం ఆ ప్రతిపాదన ఆగిపోయింది. మిథిలా స్టేడియం కింది భాగంలో బాపు బొమ్మలతో రూపొందించిన 'చిత్ర రూప రామాయణం'ను 2009లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రారంభించారు. ఆలయ అధికారుల నిర్లక్ష్యం, ప్రచారం, నిర్వహణా లోపాలతో ప్రస్తుతం ఆ ప్రదర్శనశాలకు ఆదరణ కరువైంది. కాగా భద్రాచలాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక, గిరిజన కేంద్రంగా మార్చాలని ఈ ప్రాంతవాసులు, గిరిజనులు కోరుతున్నారు.

9 ఏళ్ల క్రితం రూ.100 కోట్లు ప్రకటించిన సీఎం..

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ 2014లో తొలిసారి భద్రాచలం వచ్చిన సందర్భంగా రూ.100 కోట్లతో మాస్టర్ ప్లాన్ ప్రకటించారు. ప్రముఖ సినీ ఆర్కిటెక్ట్, దర్శకుడు ఆనంద్ సాయి ఆధ్వర్యంలో మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. కానీ అమలుకు నోచుకోవడంలేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రామాయణ సర్క్యూట్‌లో భద్రాచలానికి స్థానం కల్పించింది. దేశంలో తీర్థయాత్ర టూరిజాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చేపట్టిన 'పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ అగ్మెంటేషన్ డ్రైవ్(ప్రసాద్)' పథకంలో కూడా భద్రగిరికి నిధులు కేటాయించింది. ఈ పనులను స్వయంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భద్రాచలంలో వర్చువల్ పద్ధతిలో ప్రారంభించగా, అందులో కొన్ని భవనాల నిర్మాణాలు ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్నాయి. కాగా భక్తులకు, పర్యాటకులకు ఆహ్లాదం కలిగించేలా మాస్టర్‌ప్లాన్ రూపొందించి అమలు చేస్తే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి సాధించవచ్చు. వ్యాపారాభివృద్ధి జరిగి ఉపాధి, ఆదాయ వనరులు పెరుగుతాయి. ఈ దిశగా దేవాదాయ, పర్యాటక శాఖలు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు ఖమ్మానికి తుమ్మల రాక

ఖమ్మంవన్‌టౌన్: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం తొలిసారిగా సోమవారం ఖమ్మం రానున్నారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలకనున్నాయి. ఉదయం హైదరాబాద్ నుంచి ఖమ్మం రూరల్ మండలం శ్రీసిటీలో ఉన్న ఆయన నివాసానికి చేరుకోనున్నారు. అనంతరం 9.30 గంటలకు అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌కు చేరుకుంటారని కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్ తదితరులు పాల్గొననున్నారు.

కుక్క దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు


గాయపడిన జనిశ్రీ

ఇల్లెందురూరల్: కుక్క దాడి చేయడంతో రెండేళ్ల బాలికకు తీవ్ర గాయాలైన ఘటన కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండాలో ఆదివారం చోటుచేసుకుంది. భాగ్యనగర్ తండాకు చెందిన అజయ్, ప్రమీల దంపతుల కుమార్తె జనిశ్రీ వినాయక మండపం దగ్గర ఆడుకుంటుండగా కుక్క దాడి చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు కుక్కను తరిమేశారు. చిన్నారి కంటి కింది భాగం, నోటి సమీపంలో గాయాలవడంతో ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు.

పురుగుమందు తాగి వివాహిత ఆత్మహత్య

దుమ్ముగూడెం: భర్తతో గొడవపడి క్షణికావేశంలో పురుగుమందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని సిరిగుండం గ్రామంలో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఊకే సునీత(28)కు తొమ్మిదేళ్ల క్రితం రాజుతో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు కాగా, సునీత తన భర్తతో గొడవ పడినప్పుడల్లా.. చచ్చిపోతానని బెదిరిస్తూ పురుగుల మందు తాగేది. గతంలో ఇలా రెండు సార్లు తాగగా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఈ క్రమంలోనే ఈ నెల 21వ తేదీన సునీత భర్తతో మళ్లీ గొడవ పడి పురుగుల మందు తాగింది. ఈనేపథ్యాన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా.. పరిస్థితి విషమించి మృతిచెందింది. భర్త ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని యువకుడు..

ఇల్లెందు: ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివా రం పట్టణంలోని నంబర్-2 బస్తీలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన వినేశ్(26) గత మూడు రోజు లుగా వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని ముగించుకొని ఇంటికి తిరిగి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈక్రమంలో వినేశ్ కుటుంబసభ్యులు బయటకు వెళ్లగా.. తలుపులు వేసుకొని ఉరివేసుకున్నాడు. తిరిగి ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఉరికి వేలాడుతున్న వినేశ్‌ను చూసి వెంటనే ప్రభుతాస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వినేశ్ ఇల్లెందులోని తాత, అమ్మమ్మల ఇంట్లో నివాసం ఉంటున్నాడు.

ముర్రేడు వాగులో ఆర్ఎంపీ గల్లంతు

పాల్వంచ: ప్రమాదవశాత్తు వాగులో పడి ఓ ఆర్ఎంపీ గల్లంతయ్యాడు.మండలంలోని గుడిపాడులో ఆదివారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను పోలీసులు ఇలా తెలిపారు.పాల్వంచ పట్టణంలోని మంచికంటినగర్‌కు చెందిన పాలగడి రమేశ్(35) సంగారెడ్డిలో ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు. కాగా తన తల్లిని చూసేందుకు మంచికంటినగర్‌కు రాగ రమేశ్ బావమరిది మురళితో కలిసి సరదాగా గడిపేందుకు ఆదివారం మధ్యాహ్న సమయాన గుడిపాడు సమీపంలో ముర్రేడు వాగుకు వెళ్లాడు. అక్కడ కాసేపు సరదాగా గడిపాక బట్టలు ఉతికేందుకు వెళ్లాడు. ఈక్రమంలో కాలు జారి నీళ్లల్లో పడి కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు, కుటుంబీకులు రమేశ్ ఆచూకీ కోసం ఎంత వెతికినా దొరకలేదు. తల్లి వెంకటరమణ ఫిర్యాదు మేరకు ఎస్సై బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మావోయిస్టు కొరియర్ అరెస్ట్

చర్ల: మండలంలోని చింతగుప్ప అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం చర్ల పోలీసులు ఓ మావోయిస్టు కొరియర్‌ను అరెస్ట్ చేశారు. చర్ల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.రాజగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగాపురంకు చెందిన కొండా చరణ్ సరిహద్దు అటవీ ప్రాంతానికి వెళ్లి మావోయిస్టులను కలిసి వారి సూచన మేరకు వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలు, బ్యానర్లు తీసుకొని వస్తున్నారు. ఈక్రమంలో చింతగుప్ప శివారులో తనిఖీలు చేస్తున్న పోలీసులు పట్టుకుని కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా, ఇతను ఒక విప్లవ పార్టీకి మండల కార్యదర్శిగా పని చేస్తూ ఇటీవలనే డివిజన్ కార్యదర్శిగా ఎంపిక కాబడ్డాడు.

మమ్మేలయ్యా... మా గణపయ్యా!



గణపతి ఉత్సవాలంటే చిన్నా పెద్ద అందరికీ ఉత్సాహమే! వినాయక చవితి వస్తోందంటే నెలల ముందు నుంచే ఏర్పాట్లలో నిమగ్నమవుతారు. అయితే, కొన్ని ఉత్సవ సమితుల బాధ్యులు మూడేళ్లు, ఐదేళ్ల పాటు ఉత్సవాల నిర్వహించి ఆ తర్వాత అనేక కారణాలతో బాధ్యతల నుంచి తప్పుకుంటుంటారు. కానీ జిల్లా కేంద్రంలోని కొన్ని భక్త బృందాలు మాత్రం ఏళ్ల తరబడి అవిశ్రాంతంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నాయి. అంతేకాకుండా ఏటేటా విగ్రహ రూపుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండడం విశేషం. ఇందులో చాలా మంది పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి ప్రతిమలను ప్రతిష్ఠిస్తున్నారు. ఇలాంటి కొన్ని భక్త బృందాలపై కథనం... – ఖమ్మం గాంధీచౌక్

- జిల్లా కేంద్రంలో పలు చోట్ల ఏళ్ల తరబడి గణపతి ఉత్సవాలు
- ప్రతీ సంవత్సరం ప్రత్యేక రూపంలో గణనాథుడి ప్రతిమ

2005 నుంచి మట్టి విగ్రహాలతోనే..

జిల్లాలో మట్టి విగ్రహాలకు మూలం ఖమ్మం మామిళ్లగూడెంలోని శ్రీవరసిద్ధి విఘ్నేశ్వర స్వామి ఉత్సవ కమిటీ. ఇరవై మంది బాల్య మిత్రులు 25 ఏళ్లుగా వినాయక ఉత్సవాలను జరుపుతున్నారు. మామిళ్లగూడెంలోని సాయిబాబా గుడి ఎదురుగా జూపూడి వారి అపార్ట్‌మెంట్ వద్ద 1999లో వినాయక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత పీఓపీ విగ్రహాలతో ఉత్సవాలను నిర్వహించగా... 2005 నుంచి మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపన మొదలుపెట్టారు. అప్పట్లో ఇక్కడ విగ్రహం లభించక హైదరాబాద్‌కు వెళ్లి తయారీదారుడిని వెతికి ఆర్డర్ ఇచ్చి రైలులో తీసుకొచ్చారు. కరోనా కాలంలో కూడా నిబంధనలను పాటిస్తూ ఎక్కడా లేని విధంగా ఇక్కడ గణపతి ఉత్సవాలు నిర్వహించారు. వేల్పుల సుధాకర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆమనగంటి వెంకటరమణ, కాటంనేని రమేష్ సహకారంతో ఈశ్వర ప్రగఢ రామారావు, పీవీఎస్ నటరాజ్ తదితరులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ప్రశాంతత, ఆయురారోగ్యాల కోసం శయన గణపతి రూపంలోని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని ఉత్సవాలు జరుపుతున్నారు.


ఈ ఏడాది శయన గణపతికి పూజలు చేస్తున్న స్తంభాద్రి ఉత్సవ కమిటీ ప్రతినిధులు

పర్యావరణమే పరమావధి..

పర్యావరణమే పరమావధిగా ఖమ్మం బ్రాహ్మణ బజార్ శివాలయం వద్ద గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. 29 ఏళ్లుగా ఇక్కడ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. 1994లో మండప నిర్వహణ కమిటీగా ఏర్పడి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కొన్నాళ్లకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో కలిగే అనర్థాలను గుర్తించి 2015 నుంచి మట్టి విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. హైదరాబాద్‌లో కైలాస్‌కుమార్ గంగానది మట్టితో విగ్రహాలను తయారు చేస్తున్నట్లు తెలుసుకుని ఆయన వద్దే ఏటా విగ్రహాన్ని తెప్పిస్తున్నారు. కాగా, విగ్రహం తయారీ సమయంలోనే వనజీవి రామయ్య ఇచ్చే వివిధ రకాల విత్తనాలు, నవ ధాన్యాలను మట్టిలో కలపడమే కాక మొక్కజొన్న పిండిని రంగులతో కలిపి అలంకరిస్తారు. నవ ధాన్యాలు, విత్తనాలు వంటివి నిమజ్జనం సమయంలో 95 శాతం జలచరాలకు ప్రయోజనం కలిగిస్తుండగా, ఐదు శాతం విత్తనాలు మాత్రం మొక్కలుగా పర్యావరణంగా మారుతాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ ఏడాది త్రైలోక్య లక్ష్మీ గణపతిగా ఇక్కడ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. 30 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఏటా నిర్వాహకులు ఉత్సవాలకు రూ.4 లక్షల మేరకు ఖర్చు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రయోగ గణపతిగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతరిక్షంలో జరిపే ప్రయోగాలు విజయవంతం కావాలని, పంచతత్వం కలిగి ఉండాలని, నీటి ప్రకంపనలు జరగరాదని కోరుతూ ఉత్సవాలు చేపట్టారు. ఉత్సవాల ప్రతినిధులుగా డౌలే సాయికిరణ్ – లక్ష్మీప్రసన్న దంపతులు వ్యవహరిస్తుండగా, ఉత్సవ కార్యక్రమాలను రాకేష్, విజయ్, శివ, గోపి, పృథ్వి, చందర్, చారి, మురళి తదితరులు పర్యవేక్షిస్తున్నారు.


30 అడుగుల త్రైలోక్య లక్ష్మీగణపతి మట్టి ప్రతిమ

జూబ్లీపురలో 38 ఏళ్లుగా ఉత్సవాలు

ఖమ్మం కాల్వొడ్డు జూబ్లీపుర వినాయక ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. 1985లోనే ఇక్కడ వినాయక ఉత్సవాలను ప్రారంభించారు. కరోనా కాలంలో కూడా నిబంధనలను పాటిస్తూ వేడుకలు జరుపుకున్నారు. మొత్తంగా ఇప్పటి వరకు 37 వసంతాలు పూర్తి చేసుకొని 38వ సారి వేడుకలు జరుగుతున్నాయి. ఐదేళ్లుగా మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తుండగా.. ఈ ఏడాది 12 అడుగుల మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడ విఘ్నేశ్వరుని పూజించి లడ్డూను ప్రసాదంగా స్వీకరించిన వారికి సంతానం కలిగిందని నమ్మిక. అంతేగాక ఇక్కడ గణపతిని మొక్కుకున్న వారికి ఉద్యోగ ప్రాప్తి కలుగుతుందని నమ్ముతారు. ఇక్కడ లడ్డూ వేలం పాట నిర్వహించకుండా ముందుగా నిర్ణయించబడిన వారికి ప్రసాదంగా అందిస్తారు. విశిష్టత కలిగిన ఈ వినాయక మండపాన్ని సుందరంగా తీర్చిదిద్ది కుంకుమ పూజలు, సరస్వతి పూజ, అన్నదానం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మట్టి విగ్రహాన్ని మార్కెట్ మాజీ చైర్‌పర్సన్ డౌలే లక్ష్మీప్రసన్న సాయికిరణ్ అందించారు. కన్నం రమేష్ అధ్యక్షత ఏర్పాటయిన ఈ ఉత్సవ కమిటీలో 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ ఉండటంతో పాటు కార్యక్రమాలను పర్యవేక్షిస్తుంటారు. కమిటీ సభ్యులుగా నురుగుల మురళి, అంబటి రఘుబాబు, లెల్లల ప్రవీణ్, నురుగుల ఆనంద్, టంగుటూరి రవి, సింగారపు వినయ్‌కుమార్, కన్నం సందీప్, రవీందర్, విభూది శివ, నురుగుల బలరాం శంకర్, రాజేష్ తదితరులు సేవలందిస్తున్నారు.


ప్రస్తుత గణపతి ఉత్సవాల్లో కమిటీ సభ్యులు

రాపర్తినగర్‌లో.. రిజిస్టర్డ్ కమిటీ!

ఖమ్మం రాపర్తినగర్‌కు చెందిన కొందరు ఓ కమిటీగా ఏర్పడి శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకొని ఉత్సవాలు జరుపుతున్నారు. 2005లో నార్నే వెంకట ప్రసాద్ అధ్యక్షుడిగా రూపుదిద్దుకున్న కమిటీ 15 మందితో రిజిస్ట్రేషన్ అయింది. పర్యావరణ పరిరక్షణ కోసం గత ఐదేళ్లుగా మట్టి విగ్రహాలతో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాల నిర్వహణలో ప్రతి పైసా లెక్కకు వచ్చేలా బ్యాంకు ఖాతా ద్వారానే వెచ్చిస్తుండడం మరో విశేషం. ఉత్సవాల సందర్భంగా స్థానికులకు పోటీలు నిర్వహించి బహుమతులు కూడా అందజేస్తారు. భవిష్యత్‌లో రాపర్తినగర్– రమణగుట్ట రోడ్ కాలనీలో వినాయక గుడిని నిర్మించడమే లక్ష్యమని కమిటీ సభ్యులు చెబుతున్నారు. రూ.2.50 లక్షలతో ప్రస్తుతం వినాయక ఉత్సవాలు నిర్వహిస్తుండగా, బ్యాంకు బ్యాలెన్స్ రూ.50 వేల వరకు ఉంది. ఏటుకూరి లక్ష్మీనారాయణ, రాయల మల్లికార్జున రావు, గోల్కండ అంజయ్య, నూకం శ్రీనివాసరావు, శెట్టి లక్ష్మణ్‌రావు, రేపాల శ్రీనివాసరావు, గుత్తా నర్సింహారావు, గుండెపిన్ని నాగేశ్వరారవు, బండి జగన్ మోహన్ ప్రసాద్, ఆళ్ల మురళీకృష్ణ, తుమ్మ సత్యనారాయణ రెడ్డి, నాగండ్ల వెంకటేశ్వరరావు, మామునూరి రాజేష్, ఇంటూరి శేఖర్ రావు తదితరులు కమిటీ ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు.


రాపర్తినగర్‌లో శ్రీగణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజలు చేస్తున్న దృశ్యం

కాంగ్రెస్, సీపీఎం వర్గాల మధ్య ఘర్షణ

పలువురికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు

బోనకల్: మండలంలోని గోవిందాపురం (ఎల్) గ్రామంలో రాజకీయ విభేదాలు బగ్గుమన్నాయి. దేవాలయ ప్రహరీ నిర్మాణంలో తలెత్తిన వివాదం కాంగ్రెస్, సీపీఎం వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడి చేసుకోవడంతో 10 మందికి పైగా గాయపడ్డారు. వారిని మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీస్ స్టేషన్‌లో ఇరు వర్గాల వారు ఫిర్యాదు చేశారు. వైరా ఏసీపీ రెహమాన్, మధిర సీఐ వసంత్‌కుమార్ బోనకల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి వివరాలు ఆరాతీశారు. గ్రామంలో 144 సెక్షన్ విధించారు.

ప్రహరీ నిర్మాణం అంశంలో..

గోవిందాపురం (ఎల్) గ్రామంలో కాంగ్రెస్‌కు చెందిన సర్పంచ్ ఉమ్మినేని బాబు రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి గుడి నిర్మాణం చేపట్టారు. గుడి చుట్టూ ప్రహరీ కోసం గుంతలు తీయడంతో సీపీఎంకు చెందిన వారు ఆ గుంతలను పూడ్చి ఆ స్థలంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ పాలక వర్గంలో మెజార్టీ వార్డు సభ్యులు సీపీఎంకు చెందిన వారు ఉండడంతో ఆ స్థలంలో ప్రహరీ నిర్మాణాన్ని వారు వ్యతిరేకించడంతో కొంతకాలంగా రెండు పార్టీల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కాగా, మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో గాయాలైన వారిని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మల్లు నందిని పరామర్శించారు.


పరస్పరం దాడులు చేసుకుంటున్న ఇరు వర్గాలు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- 30లోపు స్పందించకపోతే ఉద్యమం
- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క జర్నలిస్టుకు పూర్తి ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం కేసీఆర్ భారీ బహిరంగసభలో జనవరిలోనే హామీ ఇచ్చారని, అది నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ఇళ్ల స్థలాలు అందించే బాధ్యత మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌కు అప్పగించారని, అయినా వారు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో విలువైన భూములను కారుచౌకగా రాజకీయ పార్టీల కార్యాలయాలకు కేటాయించిన సీఎం కేసీఆర్, జర్నలిస్టుల విషయంలో రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం డబ్బులు చెల్లించాలనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నెల 30వ తేదీలోపు జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై స్పష్టత లేకుంటే ఇతర రాజకీయ పార్టీలు, జర్నలిస్ట్, ప్రజా సంఘాలతో కలిసి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో ప్రధాన డిమాండ్‌గా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరామని, సుమారు 10 నెలలు కావొస్తున్నా ఇళ్ల స్థలాల విషయంలో అడుగు ముందుకు పడకపోవడం ఏమిటని నిలదీశారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నందున మంత్రులు, జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియను చేపట్టాలని కోరారు. సమావేశంలో బండి రమేష్, విక్రమ్, ఎర్రా శ్రీకాంత్, ఎర్రా నర్సింహారావు, నంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

అవినీతి 'ముద్ర'..!


అన్నపురెడ్డిపల్లి: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయం

బట్టబయలైన ముద్ర రుణాల బాగోతం

- లక్ష్యానికి మించి రుణాలు అందజేత
- అనర్హులకు మంజూరు చేసిన వైనం
- బ్రాంచ్ మేనేజర్‌పై సస్పెన్షన్ వేటు

అన్నపురెడ్డిపల్లి: చిరు వ్యాపారులు, స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్న వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముద్ర రుణాలను అందిస్తోంది. కాగా అర్హులైన వారు బ్యాంకుల ద్వారా ఈ రుణాలను పొందుతారు. ఈనేపథ్యాన అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో మాత్రం నిబంధలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేశారు. ఈ వ్యవహారంలో బ్యాంకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ముద్ర రుణాల మంజూరులో జరిగిన అవకతవకలకు కారకులైన బ్రాంచ్ మేనేజర్ నాగభూషణాన్ని శుక్రవారం సస్పెండ్ చేయగా.. విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

రూ.1.70 కోట్లకు పైగా రుణాలు..

రాష్ట్ర విభజన తర్వాత స్థానిక నాయకుల కృషితో పాటు బ్యాంకు చైర్మన్ చొరవతో కుక్కునూరులో ఉన్న డీసీసీబీను 2022 సంవత్సరంలో నూతన మండలంగా ఏర్పడిన అన్నపురెడ్డిపల్లికి మార్చారు. కాగా, 2022 జూలై నుంచి బ్యాంకులో మేనేజర్ ముద్ర రుణాలను మంజూరు చేయడం ప్రారంభించారు. కాగా, బ్యాంకు ద్వారా ఇప్పటివరకు మొత్తంగా రూ. 1.70 కోట్ల రుణాలను 373 మందికి మంజూరు చేశారు. దీనిలో బ్రాంచ్ మేనేజర్ నిబంధనలకు విరుద్ధంగా కొంత మంది వ్యక్తులకు రుణాలను పరిమితికి మించి ఇవ్వడం, బ్యాంకులో పనిచేస్తున్న వారి కుటుంబసభ్యులకు, సొంతవారికి మంజూరు చేశారని బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో బ్యాంకు ఉన్నతాధికారులు ఏజీఎం కృష్ణమోహన్‌తో ముద్ర రుణాలపై విచారణ చేపట్టారు. ఈక్రమంలో ట్రాక్టర్, హార్వెస్టర్‌కు సంబంధించిన డీజిల్ బిల్లులపై రుణాలు, ఎటువంటి వ్యాపారం లేని వారికి ఒకేసారి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఇచ్చినట్లు విచారణలో తేలింది. 2022–23లో బ్యాంకు ముద్ర రుణాల లక్ష్యం రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు కాగా.. ఏకంగా రూ.1.70 కోట్లకు పైగా రుణాలను మంజూరు చేయడంతో బ్రాంచ్ మేనేజర్‌ను సస్పెండ్ చేశారు.

రాజకీయ కారణాలే కారణమా..?

జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో రాజకీయ నాయకుల పెత్తనం ఎక్కువగా ఉంటుంది. నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంకు కావడంతో రాజకీయ నాయకులు ఒత్తిడితోనే రుణాలు ఎక్కువగా మంజూరు చేసి ఉంటారని మండల ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

నిబంధలనకు విరుద్ధంగా రుణాలు..

బ్రాంచ్ మేనేజర్ నిబంధనల విరుద్ధంగా రుణాల మంజూరు చేసినట్లు విచారణలో తేలడంతో సస్పెండ్ చేశాం. కాగా, బ్యాంకు నిర్వహణ బాధ్యతలను సత్తుపల్లి బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్‌కు అప్పగించాం.కాగా, రుణాల రికవరి కోసం తల్లాడ బ్రాంచ్‌లోని బిజినెస్ కరస్పాండెంట్‌ను అన్నపురెడ్డిపల్లికు పంపించాం. – అట్లూరి వీరబాబు, బ్యాంకు సీఈఓ

చికిత్స పొందుతూ వార్డు సభ్యురాలు మృతి

కామేపల్లి: చికిత్స పొందుతూ వార్డు సభ్యురాలు మృతి చెందిన ఘటన శనివారం గోవింద్రాల గ్రామంలో చోటుచేసుకుంది. గోవింద్రాల గ్రామ పంచాయతీ వార్డు సభ్యురాలు తేజావత్ ఈశ్వరి (30)కి జ్వరం, డయేరియా సోకింది. ఆమె సోదరుడు వినోద్ ఈ నెల 15న భద్రాద్రి కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. మరుసటి రోజు ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మూడు రోజుల చికిత్స అనంతరం ఆమెను 18న హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. 23న ఈశ్వరి మృతి చెందినది. ఈశ్వరి భర్త హుస్సేన్ తరుచూ గొడవపడి ఇబ్బందులకు గురిచేసేవాడని, ఆమె మృతి పట్ల అనుమానం ఉందని మృతురాలి సోదరుడు వినోద్ ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ...

దమ్మపేట: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మండలపరిధిలోని అల్లిపల్లి గ్రామంలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను పోలీసులు ఇలా తెలిపారు. గ్రామానికి చెందిన పొండ్ల గౌరమ్మ(55) వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం శనివారం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. అల్లిపల్లి శ్మశానవాటిక సమీపాన చింతలపూడి వైపు నుంచి మందలపల్లి వైపుకు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు గౌరమ్మను వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో గౌరమ్మ తలకు తీవ్ర గాయం కాగ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతురాలి కుమారుడు నాగరాజు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెనుబల్లి: పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని యడ్లబంజర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బన్నే పుల్లారావు (35) హెచ్ఐవీతో బాధపడుతూ శనివారం రాత్రి తన మిరప తోటలోకి వెళ్లి పురుగులమందు తాగాడు. విషయం తన అన్న కుమారుడు రమేశ్‌కు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు వెంటనే పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించి చికిత్స చేస్తుండగా ఆదివారం మృతి చెందాడు. పుల్లారావు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సూరజ్ తెలిపారు.

ముదిగొండలో కొండచిలువ కలకలం

ముదిగొండ: మండల కేంద్రంలోని ఓ ఇంట్లోకి ఆదివారం కొండచిలువ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు దానిని పట్టుకుని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి కొండచిలువను స్వాధీనం చేసుకుని, అడవిలో వదిలిపెట్టారు.


కొండచిలువను చూపుతున్న స్థానికులు

క్లుప్తంగా...

గుండెపోటుతో విద్యార్థిని మృతి



ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని టి.పల్లవి (16) ఆదివారం గుండెపోటుతో మృతి చెందింది. తొలుత విద్యార్థిని గుండెపోటుతో బాధపడుతుండటంతో వెంటనే అధ్యాపకులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే పల్లవి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థినిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ.

డిసెంబర్ 7న అసెంబ్లీ ఎన్నికలు!

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు/సహాయ వ్యయ పరిశీలకులు/ వ్యయ పర్యవేక్షణ బృందాలు/ రిటర్నింగ్ అధికారులు/సెక్టార్ అధికారులకు వేర్వేరుగా శిక్షణ, జిల్లాలకు నిధుల కేటాయింపు, అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి సంబంధించిన ధరల ఖరారు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్/స్టాటిక్ సర్వేలియన్స్ టీమ్స్/వీడియో సర్వేలియన్స్ టీమ్‌ల ఏర్పాటు తదితర పనులన్నీ వచ్చే అక్టోబర్‌నెలలోగా పూర్తి చేయాలని సీఈఓ కార్యాలయం నిర్దేశించుకుంది.

నవంబర్‌లో..

నవంబర్‌లో వివిధ స్థాయిల్లోని పోలీసు అధికారులకు శిక్షణ, పోలింగ్ సిబ్బందికి నియామక ఆదేశాల జారీ, సోషల్ మీడియాపై పర్యవేక్షణ, ఈవీఎంల తొలి ర్యాండమైజేషన్, వ్యయ పరిశీలకులకు శిక్షణ, పోలింగ్ కేంద్రాల ప్రకటన, వికలాంగులు/80 ఏళ్లకు పైబడిన వయోవృద్ధులైన ఓటర్లకు ఇంటి నుంచే ఓటు హక్కు కల్పించడానికి ఫారం 12డీ దరఖాస్తుల స్వీకరణ, సీ-విజిల్ ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదుల స్వీకరణ, పెయిడ్ వార్తలపై సమీక్ష, ఎన్నికల్లో వినియోగించేందుకు సమీకృత ఓటర్ల జాబితా ప్రకటన, పోలింగ్/కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, బ్యాలెట్ పత్రాల ముద్రణ, సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ, ఈవీఎంలకు రెండో ర్యాండమైజేషన్ నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ల పంపిణీ/స్వీకరణ తదితరాలన్నీ పూర్తి చేయాలి.

డిసెంబర్‌లో..

డిసెంబర్ నెలలో పోలింగ్ సిబ్బందికి తుది శిక్షణ, పోలింగ్ కేంద్రాలకు రవాణా సదుపాయ కల్పన, పోలింగ్‌కు 48 గంటల ముందు మద్యం అమ్మకాలపై నిషేధం, పోలింగ్, కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలి.

గల్ఫ్.. ప'రేషన్'

- ఈ-కేవైసీకి ఇప్పటికిప్పుడు రాలేమని వలస కార్మికుల ఆందోళన
- లేకపోతే రేషన్‌కార్డుల్లో పేర్లు తొలగిస్తారనే భయం
- గల్ఫ్ దేశాల్లో పనిచేసేవారి సంఖ్య 15 లక్షలకు పైగానే...
- ప్రభుత్వం వీరి విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటుందో...!



మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ దేశాల్లో పనిచేసే వలసకార్మికులు ఇప్పుడు పరేషాన్‌లో పడ్డారు. రేషన్‌కార్డుల్లో పేరు ఉన్న ప్రతి ఒక్కరు ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ సూచించిన విషయం తెలిసిందే. రేషన్ దుకాణాల్లో బయోమెట్రిక్ యంత్రంపై రేషన్ వినియోగదారులు వేలిముద్ర వేసి తమ ధృవీకరణ పూర్తి చేయాలి. రాష్ట్రంలోని వినియోగదారులు ఏ ప్రాంతంలో ఉన్నాసరే సొంతూరుకు వెళ్లకుండానే ఈకేవైసీ పూర్తి చేసే వెసులుబాటు కల్పించారు. పొరుగు రాష్ట్రాలు, విదేశాల్లో ఉన్నవారు మాత్రం స్వరాష్ట్రానికి వచ్చి ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ-కేవైసీ ప్రక్రియ ఇటీవలే ప్రారంభమైంది. అయితే దీనికి నిర్ణీత గడువు తేదీని మాత్రం ప్రభుత్వం నిర్ణయించలేదు. వీలైనంత త్వరగా రేషన్‌కార్డుల్లో పేర్లు ఉన్న వారితో ఈకేవైసీ పూర్తి చేయించాలని అధికారులు రేషన్‌డీలర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఒక కుటుంబంలోని సభ్యులు వేర్వేరు చోట్ల ఈకేవైసీ పూర్తి చేయించుకోవడానికి అవకాశముంది. ఈ విధానంతో పట్టణాలకు ఉన్నత చదువులకు వెళ్లినవారు, ఉపాధి పొందుతున్న వారు తాము ఉంటున్న పరిసరాల్లోనే ఈకేవైసీ పూర్తి చేయించుకోవచ్చు. కానీ గల్ఫ్‌తోపాటు ఇతర దేశాలకు వలస వెళ్లిన వారు ఇప్పట్లో వచ్చే అవకాశం లేకపోవడంతో వారి ఈకేవైసీ ఎలా అనే సంశయం నెలకొంది. పౌరసరఫరాల శాఖ నిబంధనల ప్రకారం ఈకేవైసీ చేయించుకోని వారి పేర్లు రేషన్‌కార్డుల నుంచి తొలగించే ప్రమాదముంది. విదేశాలకు వెళ్లినవారు సంవత్సరాల తరబడి స్వదేశానికి దూరంగానే ఉంటున్నారు. వారు వచ్చిన తర్వాతైనా ఈకేవైసీ చేయించుకోవచ్చా? అనే విషయంపై స్పష్టత లేకపోవడమే ఈ గందరగోళానికి కారణం. స్థానికంగా నివాసం ఉండనందుకు రేషన్‌బియ్యం కోటా తమకు దక్కకపోయినా ఇబ్బంది లేదని, రేషన్‌కార్డుల నుంచి పేర్లు తొలగించవద్దని అని వలస కార్మికులు వేడుకుంటున్నారు. ప్రభుత్వం ఏ సంక్షేమపథకం అమలు చేసినా రేషన్‌కార్డు ప్రామాణికంగా తీసుకుంటుంది. ఇలాంటి తరుణంలో తాము ఉపాధి కోసం సొంతూరిని విడచి వేరే ప్రాంతానికి వెళ్లామని, రేషన్‌కార్డుల నుంచి పేర్లు తొలగిస్తే ఎలా అని వలస కార్మికులు ప్రశ్నిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్న తెలంగాణవాసుల సంఖ్య 15లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈకేవైసీ నిబంధనతో వలస కార్మికులు అధిక సంఖ్యలో నష్టపోయే ప్రమాదం ఉంది. వలస కార్మికుల అంశంపై తమకు ఎలాంటి స్పష్టత లేదని నిజామాబాద్ పౌర సరఫరాలశాఖ అధికారి చంద్రప్రకాశ్ 'సాక్షి'తో చెప్పారు. ఈకేవైసీ గడువు మూడు నెలల పాటు పొడిగించే అవకాశం ఉందన్నారు.

పేర్లు తొలగించకుండా స్టార్‌మార్క్ చేయాలి

ఈకేవైసీ పూర్తి చేయని వలస కార్మికుల పేర్లు రేషన్‌కార్డుల నుంచి తొలగించకుండా స్టార్‌మార్క్ చేయాలి. వారు సొంతూరికి వచ్చిన తర్వాత ఈకేవైసీ అవకాశం కల్పించాలి. వలస కార్మికుల పేర్లు రేషన్‌కార్డుల నుంచి తొలగిస్తే వారు ఏ ప్రభుత్వ పథకానికి అర్హులు కాకుండా పోతారు. ప్రభుత్వం పెద్ద మనసుతో అర్థం చేసుకోవాలి.

– మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు

సూర్య, చంద్ర ప్రభలపై కోనేటిరాయుడు



తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజైన ఆదివారం నాడు ఉదయం సూర్యప్రభపై ఊరేగుతూ మలయప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి చంద్రప్రభపై చల్లని చంద్రకాంతుల్లో భక్తులను అనుగ్రహించారు. ఈ వాహన సేవల్లో భజన బృందాల కోలాహలం, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా భక్తులను ఆకట్టుకున్నాయి. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవంలో గరుడ సేవ తర్వాత అంత ప్రాధాన్యత కలిగిన వాహనంగా శ్రీవారి రథోత్సవాన్ని చెప్పవచ్చు. సోమవారం ఉదయం 6.55 గంటలకు మలయప్ప మహారథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి స్వామివారు అశ్వ వాహనంపై ఊరేగనున్నారు.

ఏసీబీ వలకు చిక్కిన మావల తహసీల్దార్

- పట్టా పాస్‌బుక్‌లో పేరు సవరణకు రూ.20 లక్షలు డిమాండ్
- రూ. 2 లక్షలు ముట్టజెబుతుండగా ఆర్‌ఐతో పాటు పట్టివేత
- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన



రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ మావల తహశీల్దార్ ఆరిఫా సుల్తాన, ఆర్‌ఐ హన్మంత్‌రావు

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ జిల్లా మావల తహసీల్దార్ ఆరిఫా సుల్తానా, ఆర్‌ఐ హన్మంత్‌రావు ఆదివారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. మావల పట్టణ శివారులోని వ్యవసాయ భూమికి సంబంధించిన పట్టా పాస్‌బుక్‌లో పేరు సవరణ కోసం రైతుల నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిజామాబాద్‌కు చెందిన నిర్మల్కర్ సుధాకర్ తోపాటు ఆయన కుటుంబీకులకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా మావల శివారు సర్వే నంబర్ 181లో 14 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఒక్కొక్కరి పేరిట మూడున్నర ఎకరాలు ఉన్నాయి. వీరు యతేంద్రనాథ్ యాదవ్‌ను రిప్రజెంటర్‌గా ఉంచారు. పట్టా పాస్‌బుక్‌లలో పేర్లకు సంబంధించి మార్పుల కోసం 2023, ఏప్రిల్ 13న మావల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ ఆరీఫా సుల్తానాను కలిసి పనులు పూర్తి చేయాలని విన్నవించారు. ఈ క్రమంలో ఆర్‌ఐ హన్మంత్‌రావు వారిని రూ.20 లక్షలు డిమాండ్ చేశాడు. మొదట రూ.2 లక్షలు ఇవ్వాలని సూచించగా, యతేంద్రనాథ్ ఈ నెల 21న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో డబ్బులు ముట్టజెబుతుండగా ఏసీబీ అధికారులు తహసీల్దార్, ఆర్‌ఐలను పట్టుకున్నారు. వీరిని కరీంనగర్ ఏసీబీ కోర్టుకు రిమాండ్ కోసం తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

దళిత యువతిపై దాడి

- ప్రేమ పేరుతో వేధించి హత్యాయత్నం చేసిన యువకుడు
- జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి
- ఆందోళనకు దిగిన దళిత సంఘాలు



జక్రాన్‌పల్లిలో ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

జక్రాన్‌పల్లి: ప్రేమ పేరుతో దళిత యువతిని వేధించి, హత్యాయత్నానికి పాల్పడ్డాడో యువకుడు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. జక్రాన్‌పల్లికి చెందిన దళిత యువతిని అదే గ్రామానికి చెందిన ఓ ముస్లిం యువకుడు కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. శనివారం రాత్రి ఆమెను బలవంతంగా తన బైక్‌పై ఎక్కించుకుని తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో యువతి ప్రతిఘటించి బైక్‌పై నుంచి కిందకు దూకింది. దీంతో ఆగ్రహించిన సదరు యువకుడు మద్యం మత్తులో యువతిని కొట్టి రోడ్డు పక్కన పడేశాడు. ఆమెను గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది.

గ్రామంలో ఆందోళన..

యువతిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాత్రి దళిత సంఘాల ప్రతినిధులు, బాధిత యువతి కుటుంబ సభ్యులు గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. జక్రాన్‌పల్లి అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అర్హులకు దళిత బంధు ఇవ్వాలి

వలిగొండ–తొర్రూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో

మోత్కూరు: అర్హులైన దళితులందరికీ దళిత బంధు ఇవ్వాలని కోరుతూ ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజిపురం గ్రామంలోని చౌరస్తాలో వలిగొండ–తొర్రూరు ప్రధాన రహదారిపై దళితులు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దళితులు మాట్లాడారు. పేద దళితులను కాదని ఆర్థికంగా ఉన్నవారికి దళిత బంధు మంజూరు చేశారని ఆరోపించారు. ఒక కుటుంబంలో ముగ్గురు ఆడ కూతుళ్లను కలిగిన ఓ నిరుపేద దళిత కుటుంబానికి ఇవ్వక పోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వివాహం కాని యువకులకు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హులైన వారికి దళిత బంధు ఇవ్వాలని ఆందోళనకు దిగితే పోలీస్ కేసులు బనాయిస్తున్నారని వాపోయారు. ఆందోళనలో బర్రె వెంకటయ్య, చింత నర్సయ్య, ఉప్పల నరేశ్, రాజు, మాతంగి నరేశ్, చలివేంద్ర అండాలు, మాతంగి ఎల్లమ్మ, కిష్టయ్య, మంజుల పాల్గొన్నారు.

పసి హృదయముంటేనే కవి

'అనితరుడు'పుస్తకావిష్కరణ సభలో గోరటి వెంకన్న



అనితరుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోరటి వెంకన్న, తదితరులు

కరీంనగర్‌కల్చరల్: పసి హృదయమున్నవాడు మానవవాద కవిగా విలసిల్లుతాడని ప్రజావాగ్గేయకారుడు, శాసనమండలి సభ్యుడు గోరటి వెంకన్న పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ రచయితల వేదిక (తెరవే) కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కవి ముద్దా శ్రీనివాస్‌రావు రచించిన 'అనితరుడు'పుస్తకావిష్కరణ సభకు ఆయన హాజరయ్యారు. ధర్మాధర్మాలను కవులు ప్రజలకు బాధ్యతాయుతంగా వివరించాలని సూచించారు. పసితనం, ప్రజాక్షేత్రాలను వీడిన కవిలో సృజనాత్మకత సన్నగిల్లుతుందన్నారు. సున్నిత మనస్కుడైన కవిగా వైవిధ్యభరితమైన అభివ్యక్తితో ముద్దా శ్రీనివాస్‌రావు కవిలోకంలో వెలుగొందుతున్నారని అభినందించారు. కవి నగ్నముని మాట్లాడుతూ...తెలంగాణలో సాహిత్య కార్యక్రమాలకు కరీంనగర్ కేంద్రంగా వాసికెక్కుతుందన్నారు. 366 మంది 'విమర్శ వ్యాసా'లతో వెలువడిన ఈ పుస్తకం భావి పరిశోధకులకు దిక్సూచిగా ఉపయోగపడుతుందని తెలిపారు. వ్యాసాలు రాసిన నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, దామెర రాములు, గోపగాని రవీందర్, వెంకటేశ్వర్లు కె.అంజయ్యను జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

జిల్లా వార్తలు

చెల్లింపులు ఇక ఆన్‌లైన్




ఖమ్మం మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పత్తి (ఫైల్)

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మొదలైన కసరత్తు

- ప్రస్తుతం కొన్ని అంశాల్లోనే అమలు
- ఇకపై ఈ-నామ్‌లోనే నగదు చెల్లింపులు కూడా..
- రైతులకు నష్టం జరగకుండా చర్యలు



మార్కెట్‌కు తీసుకొచ్చిన పెసలు



ఖమ్మంవ్యవసాయం: జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం(ఈ – నామ్) అమలులో బాగంగా పంటల కొనుగోళ్లలో ఆన్‌లైన్ చెల్లింపులకు కసరత్తు జరుగుతోంది. ఈ – నామ్ అమలులో ఉన్న వ్యవసాయ మార్కెట్లలో పంటలు కొనుగోలు చేసిన తరువాత తగిన పద్ధతుల్లో చెల్లించాల్సిన నగదు మొత్తాలను రైతుల బ్యాంకు ఖాతాల్లో వ్యాపారులు జమ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం అమలు జరుగుతున్న మార్కెట్ కమిటీలకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఈ-నామ్ అమలులో ఉన్న వ్యవసాయ మార్కెట్లలో ఖమ్మం ఒకటి. మార్కెట్‌లో పంటల కొనుగోళ్లలో స్థానికంగా ఉన్న వ్యాపారులు నిర్ణయించిన ధరలే అమలు జరుగుతుండటంతో ఆరుగాలం శ్రమించి పండించే రైతులకు నష్టం జరుగుతోంది. వారికి మేలు జరిగేలా జాతీయ స్థాయిలో ఈ-నామ్ విధానంలో ఆన్‌లైన్‌లో పంటలు కొనుగోలు చేసే పద్ధతిని అమలు చేస్తే రైతులకు మెరుగైన ధరలు లభించే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని చేపట్టింది. ఈ-నామ్ విధానాన్ని జాతీయ స్థాయిలో 2016 ఏప్రిల్ 14(అంబేద్కర్ జయంతి)న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. పంటల కొనుగోళ్లలో పారదర్శకత పెంచేందుకు, రైతులకు మద్దతు ధర లభించేలా జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో పంటలను కొనుగోలు చేసే పద్ధతిలో ఈ-నామ్‌ను ముందుకు తీసుకొచ్చారు. వ్యాపారులు ఏ ప్రాంతం నుంచైనా పోటీపడి పంటలకు ధరలు పెట్టే సౌలభ్యాన్ని కల్పిస్తూ ఈ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు.

ఖమ్మం మార్కెట్‌లో పాక్షికంగానే..

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం 2016 నుంచి పత్తి, అపరాల పంటలకు అమలవుతోంది. రైతులు పండించిన పంటలు మార్కెట్‌కు తీసుకొస్తే యార్డు గేటు వద్ద రైతు పేరు, పంటల వివరాలు నమోదవుతాయి. లాట్ నంబర్ కూడా ఎలాట్ చేస్తారు. ఖరీదుదారులు పంటను పరిశీలించి లాట్ నంబర్ ఆధారంగా తాము నిర్ణయించుకున్న ధరను రహస్యంగా బిడ్డింగ్(టెండర్) చేస్తారు. అధిక ధర బిడ్డింగ్ చేసిన ఖరీదుదారుకు పంట దక్కినట్లు(టెండర్ డిక్లరేషన్) ప్రకటిస్తారు. ఆ తర్వాత ఎలక్ట్రానిక్ విధానంలో వేమెంట్ ఇంటిగ్రేషన్‌లో తూకం వేస్తారు. ఇదే క్రమంలో పంట ధర, తూకం వివరాలు, కొనుగోలు చేసిన వ్యాపారి తదితర వివరాలతో కూడిన తక్‌పట్టీ జారీ అవుతుంది. ఈ ప్రక్రియ వరకు ఖమ్మం మార్కెట్‌లో ప్రస్తుతం అమలవుతోంది.

అమల్లోకి వస్తే అక్రమాలకు చెక్

పంట విక్రయాలకు సంబంధించి నగదు చెల్లింపుల్లో ఈ-నామ్ విధానంలో ఆన్‌లైన్ చెల్లింపులు అమలు జరిగితే రూ.2కు పైగా వసూలు చేస్తున్న కమీషన్లు, పెట్టుబడులు, అధిక వడ్డీలు వంటి అక్రమ దందాలకు చెక్ పడుతుంది. ఈ-నామ్‌ను సంపూర్ణంగా, పారదర్శకంగా అమలు చేస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. పంట విక్రయం నగదును ఆన్‌లైన్‌లో బ్యాంకు ద్వారా చెల్లిస్తే రైతుకు న్యాయంగా చెల్లించాల్సిన మొత్తం ఆ రైతు ఖాతాలో జమవుతుంది. ఈ విధానం పటిష్టంగా అమలు జరిగితే లైసెన్స్ లేని కమీషన్ వ్యాపారులను కూడా అరికట్టే అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్ చెల్లింపుల విధానంపై ఇప్పటికే మార్కెట్ కమిటీ అడ్తీ వ్యాపారులతో సమావేశం నిర్వహించింది. పత్తి సీజన్ ప్రారంభం కానున్న తరుణంలో ఈ-నామ్‌లో ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేసేందుకు మార్కెట్ కమిటీ సన్నద్ధమవుతోంది.

నగదు చెల్లింపులకు దూరం

ఈ-నామ్ విధానం అమలులో రైతు విక్రయించిన పంటలకు సంబంధించిన నగదును ఆన్‌లైన్ పద్ధతిలోనే చెల్లించాల్సి ఉంటుంది. ఆ విధానం మాత్రం ఖమ్మం మార్కెట్‌లో అమలు జరగటం లేదు. రైతులు పంటను మార్కెట్‌కు తీసుకువస్తే అడ్తీదారు(కమీషన్ వ్యాపారి) ద్వారా ఖరీదుదారుడు పరిశీలిస్తాడు. ఖరీదుదారు ధర నిర్ణయించినా.. అడ్తీదారుని ద్వారానే రైతుకు పంట విక్రయానికి చెందిన నగదు చెల్లింపులు జరుగుతుంటాయి. ఈ వ్యవహారంలో పంట అమ్మి పెట్టినందుకు అడ్తీదారునికి బైలా ప్రకారం రూ.100కు రూ.2 చొప్పున కమీషన్‌ను రైతులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ విధానంలో ఈ-నామ్ అమలులో లేకపోవటంతో కమీషన్ వ్యాపారులు రైతులకు నగదు చెల్లింపుల్లో రూ.4 నుంచి రూ. 6 వరకు కూడా కమీషన్లు తీసుకుంటున్నారు. ఇదేగాక పంటల సాగు సమయంలో కమీషన్ వ్యాపారులు పెట్టుబడులు కూడా పెడుతుంటారు. పంట ప్రయించే సమయంలో తిరిగి వసూలు చేసుకుంటారు. ఈ వ్యవహారంలో ఆయా పెట్టుబడులకు వడ్డీ వారి ఇష్టారాజ్యంగా ఉంటుంది. రూ.2 మొదలు రూ.5వరకు కూడా ఉంటుంది.

కొనుగోళ్లలోనూ ఈ-నామ్



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి, అపరాల పంటలకు ఈ-నామ్‌ను అమలు చేస్తున్నాం. ఈ విధానంలో పంట విక్రయించే రైతులకు నగదు చెల్లింపుల ప్రక్రియ మాత్రం ఈ-నామ్ పద్ధతిలో సాగడం లేదు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఆదేశాల మేరకు ఈ విధానాన్ని కూడా ఈ-నామ్ పద్ధతిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రుద్రాక్షి మల్లేశం, ఉన్నత శ్రేణి కార్యదర్శి, ఖమ్మం మార్కెట్


రామయ్య నిత్యాన్న దానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ అధికారులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి భక్తులు ఆదివారం విరాళం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమలాపురానికి చెందిన శ్రీలక్ష్మి రూ. 2,00,001 ఆలయ అధికారులకు అందజేయగా వారు దాతకు రశీదు ఇచ్చారు.

స్వామివారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



భద్రాద్రి రామాలయంలో న్యాయమూర్తి వేణుగోపాల్ తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్, అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ ఆదివారం వేర్వేరుగా దర్శనం చేసుకున్నారు. వీరికి ఆలయ అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం మూలమూర్తులకు పూజలు చేశారు. పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.

పర్ణశాల రామయ్యను..

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామివారిని రాష్ట్ర హైకోర్టు జడ్జి ఈవీ వేణుగోపాల్ దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం న్యాయమూర్తి పంచవటీ కుటీరం, నారచీరలను సందర్శించి, వాటి విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్‌ఐ కేశవరావు తదితరులు ఉన్నారు.



పర్ణశాలలో న్యాయమూర్తి వేణుగోపాల్...

పోరు తెలంగాణకు ఆ గొంతే ఆయుధం



సదస్సులో మాట్లాడుతున్న టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాం, పక్కన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని తదితరులు

- అణగారిన వర్గాలకు గద్దర్ ఆట, పాటలే భరోసా
- స్మారక సదస్సులో పలువురి నివాళి

సింగరేణి(కొత్తగూడెం): బతికున్నంత కాలం తన ఆట, పాటలనే ఆయుధంగా మలిచి అణగారిన వర్గాలకు పోరాడే తత్వాన్ని నేర్పిన గద్దర్ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచాడని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం రాత్రి కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన గద్దర్, జహీర్ అలీ స్మారక సదస్సులో ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, గద్దర్ కూతురు వెన్నెల తదితరులు మాట్లాడారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు పోరాడిన ప్రజాయుద్ధనౌక గద్దర్ అని అన్నారు. గొంగళి, గజ్జెలు, ఎర్రకండువా, చేతికర్రతో కనిపించే గద్దర్ సాంస్కృతిక విప్లవానికి ఐకాన్‌గా నిలిచారని కొనియాడారు. సుమారు 50 ఏళ్ల పాటు ఒకే నిబద్ధతతో నిలిచి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని, పోలీసు కాల్పుల్లో తన శరీరంలో బుల్లెట్ ఉన్నా ఏరోజూ భయపడకుండా ఆడి, పాడారని నివాళులర్పించారు. ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యాన్ని 1940 నుంచి 1973 వరకు శ్రీశ్రీ నడిపిస్తే ఆ తరువాత 50 ఏళ్ల పాటు గద్దర్ నడిపించారని, శ్రీశ్రీ పండిత భాషలో సాహిత్యం రాస్తే, గద్దర్ సాంఘిక కవిగా పేరు గాంచారని చెప్పారు. 1970 నుంచి రాష్ట్రంలో ఏ మూలన ఉద్యమం జరిగినా అందులో గద్దర్ ఉండేవారని గుర్తు చేశారు.

గద్దర్ అంతిమయాత్రలో గుండెపోటుతో మరణించిన ప్రముఖ పాత్రికేయుడు జహీర్ అలీఖాన్‌కు కూడా పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌ఫర్మేషన్ అధికారి బేబీరాజు, సీపీఎం రాష్ట్ర నాయకులు రాములు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాధినేని వెంకటేశ్వర రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, నాయకులు ఆవునూరి మధు, కాసాని ఐలయ్య, రచయిత జయరాజు తదితరులు పాల్గొన్నారు. యశ్‌పాల్, బల్లెపల్లి మోహన్, మిట్టపల్లి సురేందర్ బృందాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉమ్మడి జిల్లా నెట్‌బాల్ జట్లు సిద్ధం

ఖమ్మం స్పోర్ట్స్ : ఖమ్మం జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. జిల్లా జట్టులో స్థానం పొందిన క్రీడాకారులు ఈనెల 30 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు మేడ్చల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ ఎంపికల ప్రక్రియలో జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు దీపిక, కార్యదర్శి ఫణికుమార్, శశికళ, ప్రభాకర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండలంలోని కిన్నెరసానికి పర్యాటకులు ఆదివారం భారీగా తరలివచ్చారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా వచ్చి డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 481 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.13,495 ఆదాయం లభించగా, 150 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.7,900 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.